సెప్టెంబర్ - అక్టోబర్, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



పరలోకంలో....



# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

ప్రభువు నామములో మీ అందరికి శుభములు. మీరంతా బాగున్నారు కదా! దేవుడు మనలను మన పరిచర్యను ఆయన కృపలో భద్రపరిచినందుకు ఎంతో కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసినవారమై యున్నాము. ఆయన అనుగ్రహించిన ఈ శ్రేష్ఠమైన జీవితము గురించి ఆలోచించినప్పుడు ఎంత ప్రేమ మన యెడల కనుపరిచాడో అర్ధమవుతుంది. కనుక మనము ఎల్లప్పుడు ప్రభువు కొరకు నమ్మకముగా జీవించవలసిన వారమై యున్నాము.

ప్రభువు నందు విశ్వాసముతో కొనసాగుచున్న మనము ఆయన నామమునకు మహిమకరముగా జీవించడానికి ప్రయత్నించమని హెచ్చరించు చున్నాను. మీ ఉద్యోగములలో, పనిచేసే ప్రతి స్థలములో మరియు పిల్లలను పెంచే విషయములో ఎంతో బాధ్యత కలిగి ఉండవలెను. ఆచార అలవాట్ల కంటే బాధ్యతకు ప్రాముఖ్యత ఇవ్వాలి అనే సంగతి మర్చిపోవద్దు. కొందరు వారి బాధ్యతల విషయములో ఏ మాత్రం శ్రద్ధ లేకుండా వ్యవహరించడం ఎంతో బాధాకరమైన విషయం. బాధ్యతను సరిగా నిర్వర్తించకుండా దేవుడే చూచుకుంటాడు అనుకోవడం అజ్ఞానపు క్రైస్తవ్యమునకు పరాకాష్ఠ. ఇలాంటి వాటిని బట్టి దేవునిని ఆయన సంఘమును దూషించడానికి అనేకులకు అవకాశం కలుగుతుంది.

స్పర్శ పాఠకులైన మీలో ప్రతి ఒక్కరు బాధ్యతల విషయమై బహు జాగ్రత్త కలిగి ఉండవలయునని బ్రతిమలాడుకొనుచున్నాను. ప్రతి క్రైస్తవుడు తన జీవితములో నెరవేర్చవలసిన బాధ్యతను గూర్చి సరియైన అవగాహనతో జీవిస్తే క్రీస్తు నామము అన్ని స్థలములలో మహిమ పరచబడడం జరుగుతుంది. అనేకులను క్రీస్తు దగ్గరకు నడిపించగలుగుతాము.

అట్టి ధన్యతను స్పర్శ పాఠకులైన మీకు దేవుడు దయచేయును గాక !

మీ సహోదరుడు.....



సెప్టెంబర్ - అక్టోబర్, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- ఒంటరితనం ............ 2
- పెద్దవారే కానీ ... ............ 5
- ఒక చిన్న ఆలోచన (స్త్రీల ప్రత్యేకం) ............ 6
- పరలోకంలో.... ............ 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 18వ భాగము ............ 11
- వర్షం (బాలల శీర్షిక) ............ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ............ 15
- ప్రోత్సాహకరమైన ఫ్లోరెన్స్ జీవితము ............ 17
- రూపాయి, యూరో, పౌండ్, డాలర్ ............ 19
- నదులు ............ 20
- ప్రార్థన - ఊపిరిపీల్చుట వంటిదే ............ 21
- బైబిల్ క్విజ్-18 ............ 22
- జన్మదిన శుభాకాంక్షలు ............ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# ఒంటరితనం

**- బ్రదర్. ఎపఫ్రా**



నాకు ఎవరు లేరు, నా జీవితం వ్యర్థం, ఎందుకు బ్రతుకుతున్నానో, ఎవరు అర్థం చేసుకోరు, నా బాధ ఎవరికి చెప్పుకోవాలి. ఈలాగున ఎన్నో సమాధానం లేని ప్రశ్నలు. కొందరి జీవితములలో నిరంతరం ఒత్తిడికి గురి అవుతూ నెమ్మది లేకుండా బ్రతుకుతారు. వాటి ఫలితం చేయవలసిన పనిని సరిగా చేయలేకపోవడం, తోటి వ్యక్తులతో సరియైన విధంగా ప్రవర్తించలేక మానవ సంబంధాలను నష్టపరచుకొనుట చాలా సాధారణంగా కనపడుతూ ఉంటుంది.

ఒంటరితనం అనే భావం కలుగకుండా ఆపలేం గాని, దానిని ధైర్యంగా ఎదుర్కొనగలుగుతాం. ఇతరులు నన్ను గూర్చి తప్పుగా అనుకుంటున్నారు అని అనుకునేవారు, కారణం లేకుండా సిగ్గుపడే వ్యక్తులు, వివాహ జీవితంలో ఆటంకాలు కలిగినవారు, వితంతువులు, స్నేహభావంతో మెలగడం రానివాళ్ళు, స్త్రీ, పురుష సంబంధాల గురించి సరిగా అవగాహన లేనివారు, ఉద్యోగంలో సరిగా రాణించనివారు ఒంటరితనంతో కృంగిపోయేవారిగా ఉంటారు.

***ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను. మత్తయి 28:20***

బైబిల్ గ్రంథంలో దేవుడు వ్రాయించిన ఈ వాక్యము ద్వారా మనము ధైర్యంగా ఉండటానికి ఇష్టపడాలి. మనము ఒంటరివారముకాము అని తెలుసుకోవాలని దేవుడు ఎంతగానో కోరుకొనుచున్నాడు. సాతాను ఎప్పుడూ మనము ఎవరూ లేనివారమని దుఃఖపడుతు బ్రతకాలని, మనకు సహాయం చేసేవారు లేరని కృంగిపోవాలని చూస్తుంటాడు. ఒంటరితనము మనలను నిరాశ చెందించి శూన్యములో వున్నామనే భావన కలిగించి చేతకానివారిగా చేసి గురిలేని జీవితం జీవిస్తున్నావని కలవరపరుస్తుంది. వీటన్నిటిని భరించలేక కొందరు ఆత్మహత్యలకు కూడా ప్రేరేపించబడతారు.

***నిన్ను ఏ మాత్రమును విడువను నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా ! హెబ్రీ 13:5***

దేవుడు మనకు ఇస్తున్న ధైర్యము పైన చెప్పిన మాటలను బట్టి అర్థమవుచున్నది.

ఇంత గొప్ప వాగ్ధానములను దేవుడు మనకు అనుగ్రహించిన తరువాత మనము ఎందుకు చింతిస్తూ బ్రతకాలి. ఈ లోకంలో మనకు ఎవరు ఉన్నా లేకపోయినా, ఏది ఏమైనను ఎంత మాత్రమును విడువనని దేవుడు చెప్పడం ఎంతో ఆనందాన్ని కలిగించే విషయం. ఈ మాటలు చెప్పుచున్నది సామాన్యమైన మనుష్యుడు కాదు కాని నోటిమాట చేత సర్వసృష్టిని సృజించిన దేవుడు. అరణ్యములో త్రోవలు సిద్ధపరుచువాడును, ఎడారిలో నదులు పారజేయువాడు, భూమి గతించినా ఆకాశం గతించినా ఆయన మాట సున్నైనా, పొల్లైనా తప్పిపోదు అని పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో వ్రాయబడినది.

**తన పరిశుద్ధాలయమందు దేవుడు తండ్రి లేనివారికి తండ్రియు, విధవరాండ్రకు న్యాయకర్తయునై యున్నాడు. కీర్తన 68:5**

ఈ వాక్యమును మనము నమ్మగలిగితే తండ్రిలేని వారికి తండ్రి బాధ్యతను ఆయన తీసుకుంటాడని విధవరాండ్రైన వారికి న్యాయాధిపతిగా వారి పక్షమై ఉంటారని మనము గమనించగలము. తండ్రిలేనివారు, భర్తలేనివారు తమ జీవితములలో ఎంత భయమును కలిగించే పరిస్థితులు ఎదురైనా, ఒంటరితనం ఎంత వేధించినా దేవుని వాక్యమును బట్టి బలము పుంజుకొనవలెను.

**నా తలిదండ్రులు నన్ను విడిచినను యెహోవా నన్ను చేరదీయును. కీర్తన 27:10**

మనము వారి మాట వినుటలేదనో, మనకు దురలవాట్లు ఉన్నాయనో, సరియైన సంపాదన లేదనో, మన కన్నవారు మనలను అవమానపరచినను దేవుడు తన ప్రేమను మన యెడల కనపరిచి మనము పాపులమై యుండగానే యేసయ్య మన కొరకు తన జీవితాన్నే త్యాగం చేశారు. నీవు ఎలాంటి వాడవైనా నీ అర్హతను బట్టి కాదుకాని ఆయన కృపను బట్టి నిన్ను క్షమించి, దగ్గరకు చేరదీస్తాడు అని దావీదు చెప్పుచున్నాడు. నిన్ను ప్రభువు దగ్గరకు చేర్చుకుంటాడు అనే విషయాన్ని సాతాను ఒప్పుకోనివ్వడు. కాని ఆయన నీ మీద కోపంతో ఉన్నాడు, నిన్ను శిక్షిస్తాడు అనే భయాన్ని కలిగిస్తాడు. దానిని మనము ఎన్నడు నమ్మకూడదు.

**యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు. కీర్తనలు 23:1**

దావీదు రాజైయుండి తన సైన్యాన్ని బట్టి, వెండి బంగారములను బట్టి ధైర్యంగా లేదుకాని దేవుడే నా కాపరి నాకు కొదువ లేదు అంటున్నాడు. మన జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికి మనలను కాపాడే మంచి కాపరి మన ప్రభువే. శిష్యుడైన యోహాను కూడా తన సువార్తలో ఆయన మంచి కాపరి, అని మనలను ధైర్యపరచటం జరిగింది. ఒంటరిగా ఉన్నప్పుడు నాకు ఎవరూ లేరని నిరాశలోకి వెళ్ళకూడదు. అందరూ చుట్టూవున్న కూడా ఒంటరితనమును అనుభవించేవారు ఉంటారు. కొన్ని పరిస్థితులు

మనలను శాశ్వతంగా ఒంటరిని చేస్తాయి. అంత మాత్రము చేత మనం నిరుత్సాహపడకూడదు, వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించాలి. ఏ దారి లేనట్లుగా కనిపించినా, దేవుడు తప్పక ఒక మార్గమును మనకొరకు సిద్ధపరచి ఉంటాడు.

ప్రియమైన స్పర్శ పాఠకులైన మీరు ఎలాంటి పరిస్థితులలోనైనా ఆనందంగా జీవించటం దేవుని ఉద్దేశం. ఒంటరితనం కలిగే పరిస్థితులు రాకుండా మనము ఆపలేము కాని వాటిని దేవుని కృపను బట్టి ఎదిరించి నిలువగలము. కాబట్టి ఎవరు ఎలాంటి పరిస్థితులను బట్టి ఒంటరితనంతో కృంగిపోతున్న దేవుడు ఆయన వాక్యం ద్వారా ఆత్మ సహాయంతో మిమ్మును బలపరచును గాక!

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసనతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# పెద్దవారే కాని ......

ఒక గ్రామములో సాయంత్రం సమయములో పిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ళలో వాళ్ళకి ఏదో పేచీ వచ్చింది. ఒకరిని ఒకరు తోసుకోవడంతో రాము అనే పిల్లవాడు క్రిందపడ్డాడు. వెంటనే తల్లి వచ్చి ఎందుకు ఏడుస్తున్నావని అడిగింది. రాజు నన్ను త్రోసాడు, అందుకు క్రిందపడిపోయాను అన్నాడు.

ఏరా రాజు! ఎందుకు త్రోసావు అని వాడి వీపు మీద దబదబ రెండు బాదింది. దాంతో రాజు ఏడవడం మొదలుపెట్టాడు. రాజు తల్లి వచ్చి సంగతి తెలుసుకొని ఏమ్మా! మా వాడిని కొడతావా! నీ చేతులు విరిగిపోనూ అని తిట్టసాగింది. రాము వాళ్ళ తల్లి కూడా గట్టిగా కేకలు పెడ్తూ సమాధానం ఇచ్చింది. వాదనలు పెరుగుతూ ఉండగా వారి భర్తలు కూడా అక్కడికి వచ్చారు. రాజు తండ్రి సంగతి విని ఏమ్మా మా వాడిని కొట్టడానికి చేతులు ఎలా వచ్చాయమ్మా అని కేకలు వేశాడు. రాము తండ్రి, రాజు తండ్రిని నువ్వెవరవయ్యా మా ఆవిడని కేకలు వెయ్యడానికి అని గయ్‌మన్నాడు. మాటా మాటా పెరిగింది. ఆడవాళ్ళైతే జుట్టూ, జుట్టూ పట్టుకొని, మగవాళ్ళేమో బాహాబాహీ ముష్టియుద్ధంతో ఆ ప్రదేశం ఒక చిన్న సైజు రణరంగం అయ్యింది.

ఆ సమయములో బడి పంతులు రామయ్యగారు వచ్చారు. ఆగండి ఆగండి అని ఇరుజట్టుల చేత యుద్ధం మానిపించారు. సంగతి ఏమిటి? అని అడిగి తెలుసుకున్నారు. ఓష్! పిల్లలు ఏదో ఆటల్లో కొట్టుకున్నారని మీరు ఇంత గందరగోళం చేస్తున్నారా! ఒకసారి అటుచూడండి అని పిల్లల కేసి చూపించారు. అప్పటికే రాజు రాముతో సహా పిల్లలు మరల ఆటలలో మునిగి పోయారు. చూశారా! ఏ పిల్లలు కొట్టు కున్నారని మీరు ఇంతగా దెబ్బలాడు తున్నారో వారే జరిగిన సంఘటన మరిచిపోయి మామూలుగా కలిసిపోయి హాయిగా ఆడుకుంటు న్నారు. మీరు వారి గురించే కొట్టుకుంటున్నారనే సంగతే వాళ్ళు పట్టించు కోలేదు. చిన్న చిన్న విషయములలో ఇలా మీరు అనవసరంగా



కలుగచేసుకొని మీ మధ్య ఉన్న స్నేహభావమును కలుషితం చేసుకుంటున్నారు. ఆ పిల్లలు జరిగిన సంఘటన మరిచిపోయి హాయిగా కలిసిపోయారు. మరి మీరు అలా కలవగలరా! మీ కోపాన్ని వాళ్ళ వలె తేలిగ్గా మరిచిపోగలరా ? కనుక ప్రతి చిన్న విషయమునకు ఆవేశం తెచ్చుకోకుండా, నిదానించడం చూసీ చూడనట్లు వ్యవహరించడం ఎంతో మంచిది. అదే ఐకమత్యమునకు పునాది. ఆ మాటకి ఇరువైపు పెద్దలు సిగ్గుతో తలలు వంచుకున్నారు.

**మీరు మార్పు నొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (మత్తయి 18:3)** దేవుడు మనము చిన్నబిడ్డల వంటి స్వభావము కలిగి జీవించాలని కోరుకున్నాడు. మనము ఎంత జ్ఞానవంతులమైనా బ్రదుకు దినములన్నీ నిష్కపటమైన మనస్సుతో జీవిద్దాము.

# ఒక చిన్న ఆలోచన

- సిస్టర్ విజయ

ఆలోచనలు అనేవి సహజంగా ప్రతి ఒక్కరి జీవితములో తరుచుగా కలుగుతూ ఉంటాయి, స్త్రీలకు మరి అధికముగా కలుగుచూ ఉంటాయి. ఆ ఆలోచనలు అనుకూలమైనవైతే ఉన్నతమైన స్థితికి నడిపిస్తాయి, దేవుని యందలి విశ్వాసమును అభివృద్ధి పరుస్తాయి. ఆయన మనలను నిరుత్సాహపరచడు మరియు ఎడబాయడు అనే ఆలోచన విశ్వాసమును పెంచుతుంది. ఆ ఆలోచనే వ్యతిరేకమైనదైతే దేవుని యెడల అవిశ్వాసమును కలుగజేసి, నిరుత్సాహపరుస్తాయి. కాబట్టి ఏది ఏమైనా, మన ఆలోచనలకు శక్తి ఉందని, అవి మన జీవితమును నడిపిస్తాయి అనేది ఎంతైనా నిజం.

లేఖనములలోని ఒక స్త్రీ యొక్క శరీరములోని వ్యాధిని బట్టి కలిగిన బాధలో నుండి పుట్టిన చిన్న ఆలోచన ఏ విధంగా ఆమెలో విశ్వాసమును పెంచి, గొప్ప అద్భుతమును జీవితములో పొందుకొనేటట్లు పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగతుంది.

**పండ్రెండేండ్ల నుండి రక్తస్రావ రోగము కలిగిన ఒక స్త్రీ ఉండెను. ఆమె అనేక వైద్యుల చేత ఎన్నో తిప్పలు పడి! తనకు కలిగినదంతయు వ్యయము చేసుకొని యెంతమాత్రమును ప్రయోజనము లేక మరింత సంకటపడెను (మార్కు 5:25,26)**

యేసుప్రభువు శరీరధారిగా ఉన్న దినములలో పరిచర్య నిమిత్తం బస చేసిన ప్రాంతమైన గలిలయలోని కపెర్నహూము అనే పట్టణములో జరిగిన అద్భుతం. పాత నిబంధనా గ్రంథములో మోషే ధర్మశాస్త్రము ప్రకారము స్త్రీ దేహమునందు రక్తస్రావమైన యెడల 7 దినములు ఆ స్త్రీ కుటుంబమునకు, పనులకు అన్నింటికి దూరంగా ఉండవలెను. యూదుల ఆచార ప్రకారం ఆమె అపవిత్రమైనది, ఆమె ముట్టుకొనినది ఏదైననూ అపవిత్రమైనది. 7 దినముల తరువాత ఆమె నిమిత్తము యాజకుడు ప్రాయ శ్చిత్తము చేయ వలెను. అయితే ఈ స్త్రీ ఆరోగ్యరీత్యా బలహీనురాలు. ఆ మొదటి శతాబ్దపు దినములలో డాక్టర్లు ఎంతో శక్తివంతమైన ఆయుర్వేద చికిత్సను చేసి వ్యాధులను తగ్గించేవారు. 1,2 దినములు కాదు కానీ 12 సం॥ల నుండి ఈ వ్యాధితో బాధపడుచూ కుటుంబమునకు దూరంగా జీవిస్తూ, ఎంతమంది వైద్యుల చుట్టూ తిరిగి ఎన్ని తిప్పలు పడిననూ ఆరోగ్య విషయములో మార్పు లేక కృంగిపోయింది. ఇక నాకు ఏ దిక్కు నుండి సహాయము లేదు అని నిరాశతో అనుకుంది.

ఆ సమయములో సమాజ మందిరపు అధికారి అయిన యాయీరు కుమార్తెను బాగుచేయమని యేసయ్యను బ్రతిమాలుకొనగా ఆయన అతనితో వెళ్ళెను. బహు జనసమూహములు ఆయనను వెంబడించి, ఆయన మీద పడుచుండిరి. **ఆమె యేసుని**

**గూర్చి విని - నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదుననుకొని, జనసమూహములో ఆయన వెనుకకు వచ్చి ఆయన వస్త్రము ముట్టెను. వెంటనే ఆమె రక్తధార కట్టెను గనుక తన శరీరములోని ఆ బాధ నివారణ యైనదని గ్రహించు కొనెను (మార్కు 5: 27-29)**




బహుజనసమూహములు ఆయన మీదపడు చుండిననూ ఆమె హృదయంలో ఒకటే ఆశ, నేను ఈ బలహీనత నుండి విడి పించబడాలని. నేను ఆయన ఎదురుగా నిలబడాలని, ఆయన నన్ను చూడాలి, నాతో మాట్లా డాలి, చెయ్యి నా తలమీద పెట్టి నన్ను ముట్టాలి అనే పెద్ద పెద్ద ఆలోచ నలు చేయలేదు. నేను ఆయన వెనుకగా వెళ్ళి ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదును అనే ఒక చిన్న ఆలోచన గొప్ప విశ్వాసముతో నింపి, 12 సం॥ల నుండి ఎంతో మంది వైద్యులు నయము చేయలేని ఆ రక్తస్రావ రోగము నుండి విడుదల పొందడానికి సహాయం చేసింది.

వెంటనే యేసు తనలో నుండి ప్రభావము బయలు వెళ్ళెనని తనలో తాను గ్రహించి, జనసమూహము వైపు తిరిగి నా వస్త్రములు ముట్టినది ఎవరని అడుగగా! ఆయన శిష్యులు జనసమూహము నీ మీద పడుచుండుట చూచుచున్నావే, నన్ను ముట్టినది ఎవడని అడుగుచున్నావా? అనిరి. ఆ కార్యము చేసిన ఆమెను కనుగొనవలెనని ఆయన చుట్టూ చూచెను. అప్పుడా స్త్రీ తనకు జరిగినది యెరిగి, భయపడి వణుకుచూ వచ్చి ఆయన యెదుట సాగిలపడి, తన సంగతి అంతయు ఆయనతో చెప్పెను. **అందుకాయన - కుమారీ, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను సమాధానము గలదానవై పొమ్ము, నీ బాధ నివారణయై నీకు స్వస్థత కలుగు గాక అని ఆమెతో చెప్పెను. మార్కు 5:30-34**

ప్రభువైన యేసు అనేకమంది ప్రజలు అక్కడ ఉన్నప్పటికి ఆమెను గుర్తించి ఆమెలో ఉన్న విశ్వాసము ద్వారానే ఆ శరీర బలహీనత నుండి విడిపించారు. ఆమె మాత్రం ఎవరూ చూడకుండా వెనక నుండి మాత్రమే ఆయన వస్త్రపు చెంగుని ముడతాను అని అనుకున్నది. దేవాది దేవుడైన యేసయ్య దృష్టిలో పడింది. ఆ వస్త్రపు చెంగులో నుండి వచ్చిన ప్రభావము ద్వారా స్వస్థతను పొందుకుంది.

ప్రియ సహోదరీ! ఆలోచనలు అనేవి ఎన్నడూ మన వెన్నంటే ఉంటాయి, అవి సంతోషమును కలిగిస్తాయి, నిరాశను కలిగిస్తాయి. నిరాశను కలిగించే ఆలోచనలో నుండి జయించగలిగే ఒక ప్రభావమును నేను దేవుని సన్నిధిలో అనుభవించాలి. శరీర మరియు ఆత్మీయ బలహీనతలలో ఆయన ప్రభావమును పొందుకోవాలనే ఆలోచన ద్వారా విశ్వాసములో బలపరచబడి మేలును పొందుకుంటాము కాని అలవాటుగా, ఆచారముగా వెళ్ళాలి, ఆశీర్వాదము కోసము ఆయన సన్నిధిలో ఉంటే చాలు అనే ఆలోచనలు విడిచిపెట్టుట మంచిది.

ఆ స్త్రీ ఆలోచన, విశ్వాసము దేవుని యొక్క ప్రభావమును ఏ విధంగా పొందాయో, మన ఆలోచన మనలను విశ్వాసములో బలపరచి, అనేకులను ప్రభావవంతులుగా చేయాలని ఆకాంక్షిస్తూ ....


అట్టి కృపను దేవుడు దయచేయును గాక !

## ఉపవాస ప్రార్థన

ఉపవాస ప్రార్థన - 2011, **అక్టోబర్ 6వ** తేది (గురువారం)
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
ఆసక్తి కలిగినవారు మాత్రమే పాల్గొనవలసినదిగా మా విన్నపం.

**స్థలము:**
**వర్డ్ అండ్ డీడ్ స్కూల్ ఆడిటోరియం, హయత్‌నగర్**

**వివరములకు:** 9666666249
040-24202227



# పరలోకంలో.....

ఒకరోజు నేను కలలో పరలోకం వెళ్ళాను. దేవదూత ఒకరు నా ప్రక్కనే ఉండి చూపిస్తూ ఉండగా, దూతలతో నిండి ఉన్న గది ప్రక్క నుండి వెళ్తున్నాము. ఆ సమయములో ఒక గది అంతా ప్రార్థనలలో ప్రజలందరూ దేవునిని అడిగిన అవసరతలతో నిండి ఉండడం గమనించాను. ఆ ప్రదేశం అంతా ప్రపంచం నుండి వచ్చిన చిన్న చిన్న పేజీల ముక్కలతో ఎన్నో పేపర్లతో పూర్తిగా నిండి ఎంతో రద్దీగా ఉంది. అలా కారిడార్‌లో నడుచుకుంటూ రెండవ గదిలోనికి వెళ్ళాము. ఇక్కడ మనుష్యులు దేవునిని అడిగిన దయ, ఆశీర్వాదములు ఎవరికి చెందవలసిన వాటిని వారికి భూమి మీదకు పంపుటకు దేవదూతలు ఈ స్థలములో ఎంతో కష్టపడుచున్నారు. చివరిగా మరియొక గదిలోనికి వెళ్తూ గొప్ప ఆశ్చర్యముతో అక్కడ ఆగిపోయాను. కారణం అక్కడ ఒకే ఒక దూత ఖాళీగా కూర్చుని ఉన్నది. నేను, నాతో పాటు ఉన్న దూత లోపలికి వెళ్ళాము. “ఎలా పని చేస్తున్నారు ” అని అడిగాను. ఆ దూత ఒక నిట్టూర్పు విడిచి “బాధగా” అని సమాధానమిచ్చింది. ఎందుకనగా ప్రజలు దేవుని నుండి అడిగినవి పొందుకుంటారు కాని తరువాత తిరిగి జవాబు కూడా పంపించడం లేదు అంది దూత.

జవాబుని ఏ విధంగా పంపించాలి అని అడిగాను.

“చాలా సులభం” “కృతజ్ఞతలు ప్రభువా” అని అంటే చాలు అంది సింపుల్‌గా.

అందరూ కృతజ్ఞతలు ఏ విధంగా చెల్లించాలి అని నేను ప్రశ్నించాను

ఆ దూత ఈ విధంగా చెప్పింది.

1. రేపటికి ఆహారం ఉండి, బీరువాలో దుస్తులు ఉండి, ఉండడానికి గృహము ఉన్నవాడివైతే ఈ ప్రపంచంలో 75 % ప్రజల కంటే సమృద్ధిని కలిగిన వాడివి.
2. నీ చేతిలో కొంచెము డబ్బులు కలిగి ఉన్నవాడివైతే – ప్రపంచములోని 8 % మంది

ధనవంతులలో ఒకడివే.

3. నీవు కంప్యూటర్ ఉన్నవాడివైతే – ఆ అవకాశం ఉన్న 1 % ప్రపంచ ప్రజలలో నీవు ఒకడివి.

4. ఈ రోజు అనారోగ్యము లేకుండా చేసి, ఈ దినం బ్రదుకకుండా, చనిపోయిన అనేకుల కన్ననూ నీవు అదృష్ఠవంతుడివి.

5. ఆకలి బాధలు, సమస్యలు, భయములు లేకపోతే 700 మిలియన్ ప్రజల కంటే నీవు భాగ్యవంతుడివే.

6. ఒత్తిడి వలన కలిగే భయములు, హింసలు, అరెస్టులు లేకుండా చర్చికి వెళ్ళగలుగుచున్నావంటే 3 బిలియన్ల ప్రజల కంటే నీవు ఆశీర్వదించబడినవారిలో ఒకడివే.

7. ఒకవేళ నీ తల్లిదండ్రులు కలిసి జీవిస్తూ ఉన్నట్లైతే – నీవు ప్రత్యేకమైన వాడివే

నీవేమి చేయాలో తెలుసుకున్నావు కదా !

నీవు అధిక ఆశీర్వాదములు దేవుని నుండి పొందుకుంటున్నావని, ప్రత్యేకమైన వాడివని ఈ ప్రపంచములోని అనేకులకు లేని ధన్యతని ఆయన అనుగ్రహించారని గ్రహించిన వాడవైతే దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ, కృతజ్ఞతతో జీవించకుండా ఏలాగు ఉండగలవు?





# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 18వ భాగము**

భారతదేశంలో క్రీస్తు కొరకు జీవించాలన్న అగ్ని వంటి ఆశతో అమెరికా నుండి వచ్చిన సంపన్నుడైన ఎస్.ఇ.స్టోక్స్ గారిని అక్కడ ఉన్న దినములలోనే కలుసుకొన్నాడు సుందర్. వెంటనే వీరిరువురికి మంచి స్నేహం ఏర్పడింది. సుందర్‌ని చూచిన స్టోక్స్‌గారికి విశ్వవిఖ్యాతి గాంచిన పరి.ఫ్రాన్సిస్ గుర్తుకొచ్చాడు. భారతదేశం వెళ్ళి సేవచేయాలనే స్టోక్స్ గారి సంకల్పానికి స్ఫూర్తినిచ్చింది పరి.ఫ్రాన్సిస్ జీవితమే. అయితే పరి.ఫ్రాన్సిస్‌ను గూర్చి సుందర్‌కి ఏమీ తెలియదు. కాబట్టి ఫ్రాన్సిస్ జీవితమును సుందర్‌కి క్లుప్తంగా చెప్పాడు స్టోక్స్.

దాదాపు 800 సం॥ల క్రితం ఇటలీలో జన్మించాడు ఫ్రాన్సిస్. సంపన్న కుటుంబములో జన్మించడం వలన చేతినిండా డబ్బుండేది. యౌవనుల మధ్య పేరు సంపాదించుకున్నాడు. అయితే 22 యేండ్ల వయస్సులో దేవుని గూర్చి తలంచనారంభించాడు సువార్తను ప్రకటించుచూ, పాపములను విడిచి దేవుని వైపు తిరగమని ప్రజలను హెచ్చరించండి, రోగులను స్వస్థపర్చండి, దయ్యములను వెళ్ళగొట్టండి, ప్రజలకు మేలు చేయండి, ప్రయాణం కొరకు డబ్బు తీసుకొని వెళ్ళక, వెళ్ళిన ప్రతిచోట మీ ముందు ఉంచిన వాటిని తినండి అని యేసుప్రభువు తన శిష్యులకు ఆజ్ఞాపించిన ఆ వాక్యంపై ఒక బోధకుడు ప్రసంగించడాన్ని విన్నాడు ఫ్రాన్సిస్. ప్రస్తుతం తనతోనే ప్రభువు ఈ మాటలు చెప్పుచున్నాడని గ్రహించినవాడై దానికి విధేయుడై తన డబ్బును, ఆస్థిని వదిలివేసి సువార్తను ప్రకటించుచూ సంచరించాడు. కేవలం సువార్తను ప్రకటించడమే గాక అనారోగ్యంగా ఉన్న వారిని పరామర్శిస్తూ భిక్షకులతో తన భోజనం పంచుకుంటూ, బలహీనులకు సహాయం చేస్తూ జీవించాడు. ఎవరికైననూ ఏదైనా చిన్న సహాయం చేయడానికి కూడా తమ చిటికెన వ్రేలు ఎత్తని ఆనాటి మత గురువుల కంటే ఫ్రాన్సిస్ ఎంతో భిన్నమైన వానిగా ఉన్నాడు. జంతువులు కూడా మన వంటి దేవుని సృష్టే అని చెప్తూ జంతువుల మీద ఎంతో అధికారమును కలిగియుండినాడు. ఆ జంతువులలో ఎంతో రౌద్రంగా ఉండే క్రూర జంతువులతో సహా ఏదియు ఆయన కెన్నడూ హాని చేయలేదు. చివరకు ఫ్రాన్సిస్ ఎంతో ప్రఖ్యాతి గాంచడంతో అతని మాదిరి వలన స్ఫూర్తి నొందిన

యౌవనులాయనను వెంబడించారు. ఫ్రాన్సిస్కన్ అనే పేరుతో ఒక విధానమును ఆయన నెలకొల్పారు.

సుందర్ స్వచ్ఛందంగా ఎన్నుకున్న జీవిత విధానమును పోలియుండడం కేవలం యాధృచ్ఛికం. స్టోక్స్‌గారితో మాట్లాడుచూ సువార్త ప్రకటనకై తనకు దొరికిన అవకాశములను, ఒక చోట నుండి మరోచోటకు వెళ్ళుచుండగా తెరువబడిన ద్వారములనుగూర్చి చెబుతూ తాను ఎదుర్కొన్న కష్టములను కూడా చెప్పాడు. ప్రభువు సేవ చేయడంలో ఈ సిక్కు యౌవనుడు పొందుచున్న ఆనందమును చూచిన స్టోక్స్‌గారు ఎంతో ఉత్తేజితుడై సుందర్ వలె ఒక సాధువు లాగా, సుందర్‌తో కలిసి భారతదేశ వీధులలో తిరిగి సేవ చేయాలనుకున్నాడు. ఎన్నో నెలల తరువాత ఈ ఆలోచన కార్య రూపం దాల్చింది. ఆ తరువాత ఈ అమెరికా దేశస్తుడు సుందర్‌తో కలిసి ప్రయాణిస్తూ సుందర్ తినే భోజనమే తాను తింటూ అతని వలెనే అన్ని కష్టములను సహిస్తూ సంచరించాడు. భారతదేశపు భాష అలవాట్లు సుందర్‌కే బాగా తెలుసు గనుక సందర్‌సింగే అన్నింటికి ముందడుగు వేయాల్సి వచ్చేది..

అయితే అమెరికా వాడైన స్టోక్స్‌గారు ఎంతో విభిన్నమైన నేపథ్యం నుండి భారతదేశమునకు వచ్చి భారతీయులకే కష్టము అనిపించే జీవన విధానములో చక్కగా ఇమిడిపోయి సుందర్‌తో కలిసి ఎంతో అన్యోన్యంగా సేవ చేయడమనేదే ఎంతో ఆశ్చర్యంగా ఉంది. అయితే కాల గమనంలో స్టోక్స్‌గారు కాదు గాని సుందర్‌సింగ్ గారే శరీరంలో బలహీనుడై పోయాడు. అకస్మాత్తుగా తీవ్రమైన కడుపునొప్పి రావడం వలన జ్వరపీడితుడై, ఆ వెనువెంటనే చలి జ్వరంతో వణికి పోనారంభించాడు. నడవడానికి ఓపిక ఉన్నంత వరకు నడిచి ఆ పిదప దారిలోనే కూలబడి పోయాడు సుందర్. ఈ పరిస్థితి చూచిన స్టోక్స్‌గారు గాభరాపడిపోయి సుందర్‌ని కొంచెం సౌకర్యంగా ఉంచాలని ప్రయత్నిస్తూ ఎలాగున్నది అని ఎంతో అప్యాయంగా అడిగాడు. ఈ పరిస్థితిలో సుందర్ చెప్పిన జవాబును స్టోక్స్‌గారు తన జీవితములో ఎన్నడూ మర్చిపోలేదు. ఆ బలహీన స్థితిలోనే మెల్లని స్వరంతో క్రీస్తు కొరకు శ్రమపడడం ఎంతో మధురంగా ఉంది. నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది అన్నాడు. క్రీస్తు కొరకు శ్రమ పడడం ఎంతో మాధుర్యమని సుందర్ జీవితం గొంతు ఎత్తి పాడింది. క్రీస్తు సేవ చేయడంలో ఎలాంటి శ్రమ వచ్చినా దానిని సంతోషంగా స్వీకరించడం నేర్చుకున్నాడు సుందర్.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# వర్షం

పిల్లలూ ఆరోగ్యంగా ఉన్నారా? బాగా వర్షాలు పడుతున్నాయి. ఈ సీజన్‌లో జలుబు, దగ్గు, జ్వరాలు, రకరకాల Infections ఎక్కువగా ఉంటు న్నాయి. శుభ్రమైన నీరు తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉండవచ్చు. తరచుగా చేతులు కడుగుకొని శుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటం వలన అంటు వ్యాధులను అరికట్టవచ్చు.

వర్షాకాలమంటే పెద్దలకి చిరాకు, మీకేమో సంతోషం.... టపటపా చినుకులు పడుతుంటే తుర్రుమని పరుగెత్తుతారు. వర్షం నీటిలో పడవలు చేసి papers వేసి ఆడుతుంటారు. స్కూలుకి వెళ్ళమని మారాం చేస్తారు. స్కూలుకి వెళ్ళటానికి, పనులు చేసుకోవటానికి ఇబ్బంది కల్గించినా వర్షాల వలన మనకి చాలా ఉపయోగాలు కూడా ఉన్నాయి. త్రాగేనీరు, తినే ఆహారం, పండ్లు, కూరగాయలు లభిస్తున్నాయి. ఇంకా ఎన్నో లాభాలున్నాయి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మనం ఆరోగ్యంగా, సంతోషంగా ఉండవచ్చు. ఏది ఏమైనా పిల్లలూ మీరు స్కూలుకి డుమ్మాలు కొట్టకుండా వెళుతున్నారుగా !

మమ్మీ ఎంత నచ్చ చెప్పినా రోజీ స్కూలుకు వెళ్ళటం లేదు. తాతయ్య తనకు support మాట్లాడుతాడని ఆయనవైపే చూస్తుంది. "ఈ రోజు బాగా వర్షం పడుతుంది కదా రేపు వెళ్తుందిలే" అన్నాడు తాతయ్య.. పెద్దాయనకు ఎదురు చెప్పడం ఇష్టంలేక silent గా తన పని చేసుకుంటుంది మమ్మీ. మెల్లగా రోజీ తాతయ్యతో కబుర్లలో పడిపోయింది. వర్షం తగ్గిన తర్వాత తాతయ్య పెరట్లోకి వెళుతుంటే రోజీ కూడా వెళ్లింది. తాతయ్య విత్తనాలు జల్లుతుంటే తదేకంగా చూస్తూ, కూర్చుంది. అవి కూరగాయల విత్తనాలు అని కూరగాయలు కాస్తాయని రుచికరమైన కూరలు వండుకోవచ్చునని తాతయ్య చెప్పాడు.

"స్కూలుకి వెళ్ళకుండా ఉంటే portions అయిపోతాయి. నీకు classes అర్థం కావు కదా! ఇలా అయితే నీకు marks సరిగా రావు రోజీ. వర్షం వచ్చినప్పుడల్లా స్కూలు మానేస్తున్నావు," అని డాడీ తిడుతుంటే తాతయ్య అడ్డుకొని, "వెళుతుందిలేరా! నేను పంపిస్తానుగా అని చెబుతూ, రోజీని దగ్గరకు తీసుకొని రేపు వెళతావు కదా !" అన్నాడు, "ఊ ... వెళతాను." "తాతయ్యా ! వర్షాకాలం holidays ఉంటే ఎంచక్కా ఆడుకోవచ్చు

కదా !" అంది.

వర్షం అని నీవు స్కూలు మానేస్తే చదువులో వెనకబడిపోతావు. పిల్లలకి ఎప్పుడూ ఆడుకోవాలన్పిస్తుంది, అసలు చదువుకునే పనే లేకపోతే బావుండును అనుకుంటారు. ఇప్పుడు చదువుకుంటేనే కదా పెద్దయ్యాక ప్రయోజకులవుతారు. అన్నాడు తాతయ్య.

రోజీ నీకు కథ చెబుతాను జాగ్రత్తగా విను అని ప్రారంభించాడు. ఓ రోజు ఒకాయన గుమ్మడి కాయ పాదులు దగ్గరకు వెళ్ళి బలహీనమైన తీగలకు వ్రేలాడుతున్న గుమ్మడి కాయలను చూసి దేవుడికి తెలివుందా? బలహీనమైన పాదులకేమో బలమైన గుమ్మడి కాయలు, ఆనపకాయలు, పుచ్చకాయలు, బలమైన మఱ్ఱి చెట్టు, నేరేడు చెట్లకేమో చిన్న చిన్న కాయలు ... అసలు దేవుడికి తెలివుందా? అని విసుక్కుంటూ, గొణుక్కుంటూ ఎండలోపడి గుమ్మడికాయలు కోసి మోసుకుంటూ ఒక మఱ్ఱిచెట్టు క్రిందికి చేరి వున్న పలానా ఆ చెట్టు నీడలో గుమ్మడి కాయలను తలక్రింద పెట్టుకొని అలసట తీర్చుకొనెను. అలాగే గాఢనిద్రలోనికి జారుకొనెను.

ఈలోగా మఱ్ఱిచెట్టు నుండి మఱ్ఱిపండు టక్‌మని నిద్రపోతున్న ఆ పెద్దాయన తల మీద పడెను. ఉలిక్కపడి లేచిచూస్తే అది మఱ్ఱి పండు అప్పుడు అర్థమైంది ఆయనకు, దేవుడికి తెలివుందో? లేదో? ఒకవేళ దేవుడు గాని ఈ మఱ్ఱిచెట్టుకు మఱ్ఱిపండుగాక గుమ్మడి కాయనో లేక ఆనపకాయనో కాయిస్తే అదిగాని తలమీద పడితే? తల పచ్చడయ్యేది. దేవుడు ఎంతైనా తెలివైన వాడే ! లేకపోతే ప్రాణం పోయేది.

రోజీ! అర్థమైందా. దేవుడు చేసిన ప్రతి దానికి మనం ఏదో ఒకటి తప్పు పడుతూ ఉంటాం. వర్షాకాలం బురదను చూసి తిట్టుకుంటాం, చలికాలం చలికి తట్టుకోలేక సణుక్కుంటాం, వేసవికాలం గాలి వేయటం లేదని, కరెంట్ పోయిందని గొణక్కుంటాం. ఇలా మనకి ఇబ్బందులు ఏమీ లేకుంటే సంతోషంగా ఉంటాము. దేవుడు సృష్టించిన సృష్టిలో ఎంతో అర్థం ఉంది. దేవుడు చేసిన కాలములు, కార్యములు మనకి అర్థం కాకపోయినంత మాత్రాన తప్పు పట్టకూడదు. ప్రతి సీజన్‌లో హ్యాపీగా ఉంటారుగా .....

**– మీ అక్కయ్య**

# "నా జీవితములో దేవుని మేలులు"

- మౌళమ్మ, మానెపల్లి గ్రామము

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు వందనములు. నా పేరు మౌళమ్మ, మాది మెదక్ జిల్లా, మానెపల్లి గ్రామము. విగ్రహారాధన కుటుంబము, ఎన్నో పూజలు చేసేవారము. యేసుప్రభువు అంటే ఎవరో మాకు తెలియదు. నాకు వివాహం జరిగింది. ఒక పాప పుట్టింది. ఆ పాపకు సంవత్సరం నిండక ముందే జ్వరం వచ్చింది. ఆ జ్వరంలో ఫిట్స్ వచ్చి, బాగా ఏడుస్తూ ఉండేది. 3 నెలల వరకు చాలా హాస్పిటల్స్‌కి చూపించిననూ, ఎన్నో పూజలు చేసినా తగ్గలేదు. అప్పుడు ఒక డాక్టర్ హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళమన్నారు. అసలు హైదరాబాద్‌కు ఎలా తీసుకువెళ్ళాలో తెలియదు. మాకు తెలిసిన బంధువులు ఒకరు ఉంటే వాళ్ళ దగ్గరకి వెళ్ళాము. ఆ కుటుంబములోని వారు యేసుప్రభువుని తెలుసుకున్నారు. అతను మా పాపకు ప్రార్థన చేశాడు. మా అమ్మాయిని మారేడ్‌పల్లిలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్‌లో జాయిన్ చేశాము. అక్కడి డాక్టర్ ఈ పాపకు తలలో నీరు వచ్చింది అని వెన్నులో నుండి నీరు తీసి మందులు వాడితే తగ్గిపోతుంది అని 4 రోజులు మాత్రమే హాస్పిటల్‌లో ఉంచి ఇంటికి పంపించివేశారు.

అప్పటి వరకు నాకు యేసుప్రభువు అంటే ఇష్టం లేదు కానీ నేను ఎన్నో దేవుళ్ళు అనబడిన వాటికి పూజలు చేశాను అయినా మా అమ్మాయికి జ్వరం తగ్గలేదు, తాతయ్యగారు చేసిన ప్రార్థనల వలన మాత్రమే దేవుడు ముట్టి స్వస్థపరిచారు అనిపించి, ఆ రోజు నుండి విగ్రహారాధన పూజలు మానివేసి, నిజ దేవుడైన యేసుప్రభువుని ప్రార్థించాలని అనుకున్నాను. నా కంటే ముందే మా అక్క దేవునిని తెలుసుకుంది అప్పుడు నాకు ఇష్టం ఉండేది కాదు. ఇంక తర్వాత నేను కూడా మా అక్కతో పాటు మా ఊరిలో చర్చికి వెళ్ళడం మొదలుపెట్టాను. తరువాత మా ఆయనను ఊర్లోని కొన్ని కక్షల కారణంగా కొట్టి చంపడం జరిగింది. ఆయన చనిపోయినప్పుడు మా పాపకు 3 సం॥లు మేము ఎన్నో అప్పుల బాధతో ఉన్నాము. అప్పుడు మా బంధువులే కానీ అత్త, మామ, మరుదులే కానీ ఎవ్వరూ కూడా చూడలేదు, ఆదరించలేదు. దేవుడే మమ్మల్ని కాపాడినాడు. మేము పొలం పని చేసుకుంటూ అప్పులను తీర్చుకున్నాము. నేను చర్చికి వెళ్తూ ఉండేదానిని కానీ చాలా అపనమ్మకంతో ఉండేదాన్ని. నాకు ఏ పామో, తేలో కరిస్తే, అప్పుడు దేవుడు నన్ను స్వస్థపరిస్తే ఆయన నిజమైన దేవుడని నమ్ముతాను అని అనుకునేదాన్ని. అయితే నాకు ఏమీ జరగలేదు గాని ఊరి నుండి నన్ను చూడడానికి వచ్చిన మా నానమ్మను రాత్రి సమయములో పడుకున్నప్పుడు 4 చోట్ల తేలు కరిచింది. అప్పుడు మాకు దగ్గరలో హాస్పిటల్స్ కూడా లేవు. కానీ ఆ సమయంలో మా ఇంటి ప్రక్కన దేవునిని తెలుసుకున్న వారు ఉన్నారు. వారి ప్రార్థనల వలన దేవుడు ముట్టి

స్వస్థపరిచారు. అప్పుడు నేను, మా నానమ్మ దేవుని యందు విశ్వాసముంచాము. బాప్తిస్మం తీసుకున్నాము. నేను ఏమీ చదువుకోలేదు. ఈ హైదరాబాదు నగరములో ఏమైనా పనులు చేసుకుని బ్రతుకుదామని వస్తూ, మంచి పని లేకపోయిననూ మాకు మంచి మందిరం దొరికితే చాలు అనుకున్నాము. ఇక్కడికి వచ్చిన తరువాత ఒక సహోదరి చెప్పడం ద్వారా మేము ఎపఫ్రా మినిస్ట్రీస్‌కు రావడం జరిగింది. మేము ఈ పరిచర్యకు వచ్చినప్పటి నుండి అందరూ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ వలె మమ్మల్ని ఎంతగానో ఆదరిస్తున్నారు. కొద్ది రోజుల తరువాత నాకు ఎలర్జీ వచ్చింది. ఎన్నో హాస్పిటల్స్‌కు తిరిగాను కానీ తగ్గలేదు. తరువాత దైవసేవకులకు చెప్పి ఇంట్లో ఉపవాస ప్రార్థన పెట్టించుకున్నాము, దైవసేవకులు, సంఘము ప్రార్థన వలన దేవుడు ముట్టి స్వస్థపరిచారు. మా పాప చదువు విషయంలో కూడా చదివించడం నా వల్ల కాదు అని అనుకున్నప్పుడు దేవుడు సహాయం చేసి చదివించుకోవడానికి కృపను చూపించారు. అంత మాత్రమే కాక ఏమీ చదువుకోని నాకు ఆయన కృపని తోడుగా ఉంచి, నేను చేయుచున్న పనులన్నింటిని ఆశీర్వదిస్తూ నా బంధువులలో ఎవ్వరిని చేయి చాచి అడిగే వారిగా కాక, అన్నింటిని సమృద్ధిగా దయచేసిన దేవునికి ఎంతైనా ఋణస్తురాలనే.

ఏ యోగ్యత, జ్ఞానము, మంచితనము లేని నన్ను ప్రేమించి, రక్షించి మంచి పరిచర్యను, దైవసేవకులను అనుగ్రహించి అనుదినము శారీరకముగాను, ఆత్మీయముగాను పోషించుచున్న దేవునికి ఎంతగానో కృతజ్ఞతలు చెల్లించుకొనుచున్నాను. మేము చివరి శ్వాస వరకు దేవునిలో, పరిచర్యలో నమ్మకముగా జీవించునట్లుగా మా కొరకు ప్రార్థించగలరు.

**ఎపఫ్రా మినిస్ట్రీస్ – హైదరాబాద్‌లో జరిగే ఆరాధన స్థలములు:**

1. భాగ్యలత కాలని, **వనస్థలిపురం**
2. హెచ్.యం.టి., **చింతల్**, జీడిమెట్ల
3. **అనాజ్‌పూర్**, రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర
4. **ఇ.సి.ఐ.ఎల్** బస్టాండ్ దగ్గర

**వివరములకు :**
**సెల్ : 9666666249 | ఫోన్: 040-2420 2227**

# ప్రోత్సాహకరమైన ఫ్లోరెన్స్ జీవితము



19వ శతాబ్దములో హీనంగా చూచే నర్సింగ్ వృత్తిని ఒక గౌరవప్రద ఖ్యాతికి తీసుకురావడానికి కారణమైన ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820లో ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో ఉన్నత బ్రిటీష్ కుటుంబములో జన్మించింది. ఈమె వల్లనే ఆ పట్టణమునకు ఫ్లోరెన్స్ అనే పేరు కలిగింది. నర్స్ అనే పదానికి నిజమైన అర్థం ఈమె వల్లనే కలిగిందంటే అతిశయోక్తి కాదు.

బాల్యములో నుండి ఫ్లోరెన్స్ తన స్నేహితురాలితో కలిసి సరదాగా అడివికి వెళ్తూ ఉండేది. అక్కడ తనకి ఉన్న ఒక కుక్కతో నివసిస్తున్న గొర్రెల కాపరి ఇంటిని చూచింది. అతనికి ఆ కుక్క తప్ప ఎవరూ లేరు. ఒకరోజు ఫ్లోరెన్స్ అతని వద్ద కుక్క లేకపోవడం చూచి నీ కుక్క ఏది? అని అడిగింది. అందుకు అతను ఒక పిల్లవాడు దాని రాయితో కొట్టి కాలు విరగగొట్టాడు. ఇంక అది చచ్చిపోతే బాగుండు అన్నాడు. ఫ్లోరెన్స్ చాలా బాధపడి అది ఎక్కడ ఉంది? అని అతనిని అడిగింది. ఆమె ఆ కుక్కను చూచి దాని కాలు విరగలేదని తెలిసి శుభ్రమైన నీటితో కాలు కడిగి దానికి కట్టువేసి అది బాగు అయ్యేంతవరకు ఎంతో ప్రేమతో చూచుకుంది. అది బాగవగానే ఆ కాపరి ఎంతో సంతోషించాడు. ఈ సంఘటన నైటింగేల్ జీవితమును మలుపు త్రిప్పింది.

17 సం॥ల వయస్సులో ఈమె ఆత్మీయ స్పర్శ కలిగినదై దైవసేవ చేయాలనే వాంఛతో 1850వ సం॥ జర్మనీలో ఉన్న నర్సింగ్ స్కూల్‌లో నర్స్ శిక్షణ పొందింది. టర్కీలో జరుగుచున్న క్రిమియన్ యుద్ధంలో సైనికులకు సరియైన చికిత్స (నర్సింగ్) లేక ప్రాణాలు పోతున్నాయి. ఉన్న కొద్దిమంది నర్స్‌లు ఆ యుద్ధ ప్రాంతం నుండి బయటకు వచ్చేస్తున్న దశలో ఫ్లోరెన్స్ తన ప్రాణములను కూడా లెక్క చేయక వారి ప్రాణములను కాపాడడానికి, వారికి సహాయం చేయాలని నిర్ణయించుకుంది. ఫ్లోరెన్స్ తన సహచరులతో కలిసి హాస్పిటల్స్ శుభ్రపరిచి, వస్తు సామగ్రిని ఏర్పరిచి, సరియైన చికిత్స సదుపాయములను కల్పించింది.



అయినను మరణించే సైనికుల సంఖ్య తగ్గలేదు సరికదా ఎక్కువైంది. ఆమె తన మొదటి టూర్‌లో అనేక రోగములతో 4077 సైనికుల మరణములను చూచింది. తన ప్రయత్నం విఫలమైనట్లు అనిపించినా, క్రుంగలేదు.

సరియైన పారిశుద్ధ్యం లేక అనేకులు మరణిస్తున్నారని, సైనికుల ఆరోగ్య కమీషన్‌కు నివేదించింది. అక్కడ ఉన్న మురుగునీటిని శుభ్రం చేసి, సరియైన గాలి, వెలుతురు కోసం ఒక పారిశుద్ధ్య కమీషన్‌ను బ్రిటన్ ప్రభుత్వం పంపడం వలన కొంత మరణాల సంఖ్య తగ్గింది. తర్వాత నైటింగేల్ ఆర్మీ హెల్త్ కమీషన్‌లో ప్రముఖ పాత్రను పోషించింది. ఆ తరువాత సైనికులకు ఆరోగ్యానికి కావలసిన పరికరాలు, సదుపాయముల కోసము గణాంకములతో సహా 1000 పేజీల నివేదిక రూపొందించింది. దీంతో ప్రభుత్వం వారి కోసం ఒక మెడికల్ స్కూల్‌ని స్థాపించింది.

ఈమె చేసిన కృషికి ఫలితంగా అనేకులు స్పందించి ఇచ్చిన 45 వేల బ్రిటన్ పౌండ్లతో 1860 లో ఒక హాస్పిటల్ స్థాపించి, అనేకులకు నర్స్‌గా శిక్షణ నిచ్చింది. అంతే కాదు నర్సింగ్‌లో అనేక పుస్తకాలు వ్రాసింది. అనేక నర్స్ కళాశాలలకు మూలరాయిగా నిలిచే 136 పేజీల పుస్తకం రూపొందించింది ఈ దయామయి నైటింగేల్. నర్స్ వృత్తిని అభివృద్ధి చేయడానికి అనేక రీతులలో తన శేష జీవితమును అంకితం చేసింది. ఈమె జీవితం ఓ నిస్వార్థసేవకు నిలువుటద్దం. అనేకులకు ప్రేరణగా నిలిచిన స్ఫూర్తి ప్రదాత ఈ ఫ్లోరెన్స్.

స్వార్థపూరితమైన లోకములో తన నిస్వార్థమైన జీవితముతో తన చుట్టూ ఉన్న పరిస్థితులను ఎంతో సుందరంగా మార్చిన ఈ మహిళ నుండి మనము ఎంతో నేర్చుకోవాలి. నాకు, నాది అనే భావమును విడిచి మన బాధ్యతలను ఎంతో ప్రేమతో నెరవేరుస్తూ దేవుని ప్రేమ రాజ్యమును నిర్మిద్దాము.

# రూపాయి, యూరో, పౌండ్, డాలర్



**ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును, హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము (1 తిమోతి 6:9,10)**

ధనాపేక్ష వలన అవివేకులము ఎలా అవుతామో గమనించుకుంటే ఆశ్చర్యము కలుగుతుంది. హానికరమైన దురాశలు అనగా అపాయకరమైన దురాశలు అనుకోవచ్చు. నేటి నవనాగరిక ప్రపంచములో లెక్కలేనన్ని దురాశలు మానవుని జీవితమును నాశనం చేయుచున్నవి. తిమోతికి వ్రాసిన పత్రికలో పౌలు తిమోతికి ధనాపేక్షను గురించి ఎన్నో హెచ్చరికలు చేయడం జరిగింది. అంతేకాకుండా మన ప్రభువైన యేసుక్రీస్తు శరీరధారిగా ఉన్న దినములలో ధనాపేక్ష ఎంత కీడులకు మూలమో అనేక ఉపమానముల ద్వారా హెచ్చరించారు.

మన దేశంలో గమనిస్తే ఎన్నో సంవత్సరములు కష్టపడి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారు కూడా ధనాపేక్షలో పడి వారి భవిష్యత్‌ని నాశనం చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నాము. వారికి తినడానికి తిండి లేక కాదు కానీ, ధనాపేక్ష వారిని జైళ్ళపాలు చేసి వారి విలువనంతా దిగజార్చడం మనం గమనించగలం. ధనాపేక్ష వ్యసనము కంటే ఘోరమైనది అని అనుకోవచ్చు. ఎందుకనగా అది ఏ స్థాయిలో కూడా తృప్తి అనేది లేకుండా చేస్తుంది.

క్రీస్తుని ఎరిగిన మన జీవితములలో ఎన్నడూ ధనాపేక్ష వలన కలిగే దురాశలలో చిక్కుకొనకూడదని తప్పక గ్రహించాలి. దురాశలను ప్రోత్సహించే సంఘటనలు నేడు అనేక క్రైస్తవ సంఘములలోను కనిపించడం శోచనీయమైన సంగతి. క్రైస్తవ సంఘములలో కొంత డబ్బు మొదట చెల్లించుట ద్వారా ప్రతినెల అంతకంటే ఎక్కువ డబ్బులు సంపాదించ వచ్చును అని కొన్ని స్కీమ్స్ ప్రకటించడం దీనికి ఉదాహరణ. వీటికి క్రైస్తవులు అని చెప్పుకునే దురాశపరులు ఆకర్షించ బడుచున్నారు. ఇలాంటి పథకములు పేదల కొరకు ఎవరైననూ ఉద్దేశించినప్పటికి దీనిలో 90 శాతము కంటే ఎక్కువ మంది లబ్దిదారులు అన్నీ కలిగి ఉన్న దురాశపరులే అనేది కఠోరమైన సత్యం. మనము కలిగియున్న ధనము ఇతరుల కొరకు ఏ విధంగా వినియోగించాలి అనే ఆలోచన కంటే ఇతరుల ధనమును మనము ఎలా వశపర్చుకోవాలి అనే దాని మీద శ్రద్ధ. ఉచితం లేదా లాభం అంటే నేను అర్హుడినా కాదా అని కూడా ఆలోచించకుండా దానిని పొందాలి అని అనుకోవడం క్రైస్తవులకు తగదు.

క్రీస్తునందు విశ్వాసముతో జీవించుచున్న మనము దురాశపరులము కాకుండా ఉండడానికి దేవుని సన్నిధిలో మంచి తీర్మానము చేసుకుందాము.

అట్టి ధన్యత దేవుడు మనకి అనుగ్రహించును గాక !

# నదులు



బైబిలు గ్రంథములో ఉన్న నదులను గురించి తెలుసుకుందాము. దేవుడైన యెహోవా ఆకాశమును భూమిని వాటిలో ఉన్న సమస్త సమూహమును సంపూర్తి చేసి తూర్పున ఏదేనులో ఒక తోట వేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను. ఆ తోటను తడుపుటకు ఏదేనులో నుండి ఒక నది బయలుదేరి అక్కడి నుండి చీలిపోయి నాలుగు శాఖలాయెను

1. పీషోను 2. గీహోను 3. హిద్దెకెలు 4. యూఫ్రటీసు

1. పీషోను నది – ఇది హవీలా దేశమంతటి చుట్టూ పారుచున్నది. అక్కడ బంగారమున్నది. ఆ దేశపు బంగారము శ్రేష్ఠమైనది. అక్కడ బోళమును, గోమేధికములును దొరుకును

2. గీహోను నది – (ఊట ఉబుకుట) రెండవ నది. యెరూషలేము దగ్గర ఉన్న ఒక ఊట. ప్రజలు సొలొమోనునకు గీహోను దగ్గర పట్టాభిషేకము చేసిరి. రాజైన హిజ్కియా అచ్చటి నుండి యెరూషలేమునకు పడమరగా ఒక కాలువ కట్టించి నీటిని పట్టణములోనికి తెప్పించెను. అతని కుమారుడగు మనష్షే కట్టించిన ప్రాకారములకు ఈ ఊట ఒక హద్దుగా ఉన్నది.

3. హిద్దెకెలు – ఏదేనులో మూడవ నది. దానియేలు తన దర్శనమందు చూచిన గొప్పనదికిని పేరుగా ఉన్నది. ఆర్మీనియాలోని టౌరస్ పర్వత ప్రతి పంక్తి యందు పుట్టి 1150 మైళ్ళు ప్రవహించి పారసీక సముద్రమునకు సమీపముగా యుఫ్రాతు నదిలో కలియుచున్నది. తూర్పుగా ఉండు పర్వతముల నుండి అనేక ఉపనదులు వచ్చి దీనియందు కలియుచున్నవి. పూర్వమున నినెవె పురమును, ప్రస్తుతమున బాగ్దాదును ఈ నదీ తీరమున ఉండు పట్టణములు. ఆ దేశస్థులు ఇప్పటికిని హిద్దెకెలు అను పేరునే వాడుదురు గాని వారి వాడుక ననుసరించి ఇతరులు సాధారణముగా దీనిని టైగ్రీసు అని పిలుతురు.

**(ఇంకా ఉంది)**

# ప్రార్థన - ఊపిరిపీల్చుట వంటిదే

మనం **"ఆత్మ వలన ప్రతి సమయమందును, ప్రతి విధమైన ప్రార్థనలు విజ్ఞాపననను చేయుచు" వుండాలని ఎఫెసీ 6:18** చెప్తుంది. మరొక విధంగా చెప్పాలంటే మనం పరిశుద్ధాత్మ నిర్దేశకత్వాన్ని అనుసరిస్తూ, ప్రతి పరిస్థితిలో, వివిధ సమయాలలో ప్రార్థనలు చేయాలని పౌలు వ్రాస్తున్నాడు. అన్ని సమయములలో ప్రార్థించుట అంటే **"విసుగక ప్రార్థించుట" (1 థెస్సలోనిక 5:17)** కాని దాన్ని ఎలా చేయగలము? కృతజ్ఞతా స్వభావము కలిగి ఉండి, మన దయనొందిన జీవితములలో దేవునిపై పూర్తిగా ఆధారపడి, మనం చేయవలసిన అన్ని పనుల మధ్యలో మన తలంపులను ఆయన వైపు త్రిప్పుకొనుట ద్వారా అలా చేయగలము. మనము ప్రార్థనను ఒక కార్యక్రమముగా కాకుండా ఒక జీవిత విధానము వలన, మనం చేసే పనులన్నిటిలో అంతరంగంలో సాగిపోయే క్రియవలె మారాలని దేవుడు నిజంగా కోరుకుంటున్నాడని నేను నమ్ముతున్నాను. నిరంతరంగా మనము ఆయనతో మాట్లాడాలని ఆయన మాటలు వినాలని మన హృదయములు ఆయన వైపు త్రిప్పబడియుండగా నిరంతరం ప్రార్థించాలని దేవుడు కోరుకుంటున్నాడు.

మనం ఎప్పుడైనా ఎక్కడైనా ప్రార్థించగలం. మనం అన్ని సమయములలో, అన్ని సందర్భములలో అన్ని విషయములను గూర్చి ప్రార్థించాలని, విసుగక ప్రార్థించాలని, మనకు సూచనలు ఇవ్వబడ్డాయి. అయితే ఒక మూల కూర్చుని రోజంతా దేవునితో మాట్లాడుతూ గడుపలేమని మనకి తెలుసు. అలా చేస్తే మనం మన జీవితము జీవించలేము. ప్రార్థన ఊపిరి పీల్చుట లాగా నిరంతరంగా, సులువుగా, వ్యక్తిత్వంలా మరియు మన జీవిత విధానం వలెనే ప్రార్థించవలసియున్నది. నిజానికి మన భౌతిక జీవితాలు ఊపిరి పీల్చుట వలన బ్రతుకుతున్నట్లుగా మన ఆత్మీయ జీవితాలు ప్రార్థన వలన బ్రదుకుతాయి. మనము బిగ్గరగా ప్రార్థన చేయవచ్చు లేక మౌనంగా ప్రార్థించవచ్చు. మనము కూర్చుని, నిల్చుని ప్రార్థించవచ్చు. మనము కదులుతున్నప్పుడు, స్థిరముగా ఉన్నప్పుడు ప్రార్థించవచ్చు. ఏదైనా కొంటున్నప్పుడు, ఎవరినైనా కలవడానికి వేచి యున్నప్పుడు, బిజినెస్ మీటింగ్‌లో ఉన్నప్పుడు, ఇంటి పనులు చేస్తున్నప్పుడు, కారు నడుపుతున్నప్పుడు లేక స్నానము చేస్తున్నప్పుడు కూడా ప్రార్థించవచ్చు. మనము "నీవు చేసిన వాటన్నిటికై వందనాలు ప్రభువా" లేక " స్తోత్రం ప్రభువా నాకు సహాయం చేయి" లేక "ఓ యేసూ అక్కడ బాధగా కనిపిస్తున్న స్త్రీకి సహాయం చేయి" ఈ విధంగా ప్రార్థించవచ్చు. నిజానికి ఇలా ప్రార్థిస్తూ దేవుని చేరుట దేవుని చిత్తమైయున్నది. అయితే ఒక ఖచ్చితమైన విధానంలో ప్రార్థనను అనుసరించాలని అనుకుంటూ ప్రార్థన లేని జీవితం అనేది సాతాను చిత్తమైయున్నది.

**(ఇంకా ఉంది) - సేకరించబడినది (జాయిస్ మేయర్ గారు వ్రాసిన గ్రంధం)**




# బైబిల్ క్విజ్ -18

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.

**1.** శక్యమైతే మీ కన్నులు ఊడబీకి నాకిచ్చివేసి యుందురని దేనిని గూర్చి సాక్ష్యము?

**2.** పౌలు అంతియొకయలో ఎవరిని ఎదిరించెను?

**3.** విశేషముగా ఎవరి యెడల మేలు చేయాలి?

**4.** గలతీయులు పౌలును బట్టి ఎందుకు దేవుని మహిమ పరిచారు?

**5.** స్తంభములుగా ఎంచబడిన వారు ఎవరు?

**6.** గలతీలో దేవుడు పిలిచిన వారిని చూచి పౌలు ఎందుకు ఆశ్చర్యపడుచున్నాడు?

**7.** దేనియందు పౌలు అతిశయపడుచున్నాడు?

**8.** ధర్మశాస్త్రమంతయు ఏ మాటలో సంపూర్ణమైయున్నది?

**9.** పౌలు దృష్టికి పేతురు అపరాధిగా ఎందుకు తీర్చబడెను?

**10.** ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి మనలను విమోచించినదెవరు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు అక్టోబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు నవంబర్ 2011 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 17 జవాబులు :</u>**

**1.** పౌలు 2 కోరింథీ 12:13
**2.** ప్రభువగు ఆత్మచేత 2 కొరింథీ 3:18
**3.** శిశువులుగా ఉండుడి 1 కొరింథీ 14:20
**4.** క్రీస్తుకు విరోధముగా పాపం చేసినవారము 1కొరి 8:12
**5.** **పౌలు** 2 కొరింథీ 12:15
**6.** ప్రకృతి సంబంధియైన మనుష్యుడు - 1 కొరింథీ 2:14
**7.** క్రీస్తు రక్తములో 1 కొరింథీ 10:16
**8.** పౌలు 2 కొరింథీ 12:5
**9.** దౌర్భాగ్యులము 1 కొరింథీ 15:19
**10.** దృష్టాంతములుగా ఉన్నవి 1 కొరింథీ 10:6

**<u>బైబిల్ క్విజ్ - 17 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

సాల్మన్ రాజు, స్వరూప రాణి, సౌజన్య, మల్లిక, జ్యోతి, రాజ్‌కుమార్, విజయ, పార్వతి, సరస్వతి, చంద్రకళ, సుధారాణి,వాణి, నాగరాజు, జానకి, దినేష్, ఆశాకిరణ్, కృప

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## సెప్టెంబర్ - అక్టోబర్

**భాగ్యలత** : సందీప్, ఇందిరా ప్రియ, ఐజాక్, ప్రసాద్, జ్యోతి, ప్రియాంక, సుధ, శ్రీలక్ష్మి, షాలేం, కిరణ్‌కుమార్, మాధురి, ప్రేమ్‌కుమార్, దీవెన, చెన్నకేశవరెడ్డి, ప్రదీప్‌కుమార్, స్వరూప్, హోసన్న, అరుణ, రాణి, శేఖర్, ప్రజ్ఞ, అనిత, అన్నపూర్ణ, ప్రీతి, నిర్మల, ఉషారాణి, ఫిలిప్పు, సాల్మన్‌రాజు, మాధవి, శామ్సన్, ఏసుబాబు, దీపిక, షారోను, ప్రియదర్శిని, సూర్యరాజు, మల్లేశ్వరి, సైమండ్, సుధారాణి, ప్రణీత్‌కుమార్, ప్రసన్నకుమార్, దివ్యదీపిక, సంజయ్‌రాజు, రవికుమార్ (మిర్యాలగూడ)

**చింతల్** : జయరాజ్, జయమ్మ, సుధాకర్, సోనురాజ్, ప్రసాద్, శ్యామ్, శేఖర్, కళ్యాణ్, కృష్ణవేణి, ఎఫ్రాయిము, రాజేష్, పద్మజారాణి, పవన్‌కుమార్, సునీల్‌కుమార్, త్రిమూర్తులు, భవాని, రాజు, నరేంద్ర, ప్రమీల, రాజేష్, దుర్గాప్రసాద్, వేణుకుమారి, శ్రీహర్షవర్మ, మీనా, సంధ్య, ఇందిరాజ్యోతి, శేఖర్, సాగర్

**అనాజ్‌పూర్ :** వరప్రసాద్, కళ్యాణ్ కుమార్, రామారావు, సుష్మ, మమత, చంద్రకళ

**ఇ.సి.ఐ.యల్ :** సుజని

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________

2. చిరునామా: ______________________

______________________

______________________

పిన్ కోడ్: ______________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________

______________________

______________________

______________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040-2420 2227

ఆగస్టు 15, 2011 సోమవారం ధనుంజయ గార్డెన్స్‌లో జరిగిన ఉపవాస ప్రార్థన
దేవుడు ఎంతో ఆశీర్వాదకరంగా జరిగించాడు. అందును బట్టి దేవునికి స్తోత్రము.



ఆగష్టు 15, 2011 సోమవారం ధనుంజయ గార్డెన్స్‌లో జరిగిన ఉపవాస ప్రార్థన ప్రారంభములో జాతీయ జెండాను ఎగురవేసి దేశం కొరకు ప్రార్థించడం జరిగినది.









# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 966666249